# తెల్ల గులాబి

అప్పాజీ



"ప్రియమైన తెల్ల గులాబికి!...............

వేసవి రోజుల్లో నిన్ను - చూస్తుంటే నాకెంతో జాలిగా ఉంటుంది సరోజా! బిగువైన గౌను.. గాలి చొరకుండా కాళ్లకు మేజోళ్ళు... రోజుకుపది గంటలు రోగులకు సేవ చేస్తూ ఆసేవలో ఎంతో ఆనందాన్ని అనుభవిస్తుంటావు......ఇంటికి వచ్చి గౌనువిప్పి దేహాన్ని తేలికైన చీరలో ఇముడ్చు కున్న తర్వాత నీకు ముందుగా సాక్షాత్కరించేది ఎవరో చెప్పనా? నీవు ముద్దుగా పెంచి పెద్ద చేసిన తెల్లగులాబీ మొక్కలు—వాటికెదురుగా ఎంతో ఎత్తుల్లో పెరిగిన మాపెరటి లోని ఎర్రగులాబీ మొక్కల్ని తనివి తీరా చూస్తూ పులోనే వాటికి స్నేహం నేర్పి స్నేహంతోనే ఊపిట్టక ప్రణయ మంత్రం కూడా నేర్పిస్తుంటావుకదూ!... నన్ను తెల్ల గులాబి అని జాబుల్లో ముద్దుగా పిలుస్తుంటావే! ఆపేరుకు నేను తగిన దాననా మోహన్ బాబూ? అని మొన్న వ్రాసిన జాబులో ప్రశ్నించావు. ఎంత ఆలోచించినా అంతకన్నా ముద్దు పేరు మంచిపేరు మరొకటి లభించలేదు సరోజా! తెల్లటి ముద్దు ముఖం తెల్లటి పలువరుస ఎంతో తెల్లగా వున్న తెల్లని దుస్తులు అంతకన్న నిర్మలమైన తెల్లని నీమనసు— తెల్ల గులాబీకన్నముద్దొచ్చే పేరు మరేముంది సరోజా! నన్ను ఎర్రగులాబీ అని అలా పిలుస్తుంటావు? ఆపిలుపులో ఎంతఆత్మీయత వుంది సరోజా! పెరిగి పెద్దదవుతూన్న మన స్నేహ స్వరూపము ఆఖరుకు ఎలా మారుతుం దంటావు? అటు మీ అమ్మ—ఇటు మాఅన్నయ్యా మనల్ని ఒకంట కనిపెడుతున్నట్లే వుంది. మనిద్దరినీ చనువుగా వుండమని చెప్పే ఆకిటికీమీద అన్నయ్యా కెంత కోపమనుకున్నావు? ఆదివారం ఆగిపోకుండా రామకృష్ణా బీచిలో కలుసుకోవాలి— అమ్మను మాత్రం నీ వెనుకని తీసుకు రాకు

—నీ ఎర్రగులాబి."

సరోజ మోహన్‌బాబు వ్రాసిన ఆజాబును ఎన్నో మార్లు చదువుకుంది— హృదయానికిచంటి పాపలా అదుముకుంది. దానికి కొద్దిపాటి సెంటు పూసి డ్రాయర్లో ఓమూల పదిలంగాపెట్టి దాని మీద ఓ తెల్ల గులాబీని దాని ప్రక్కనే ఓఎర్ర గులాబీని అమర్చింది.

ఆదివారం రానే వచ్చింది. అమ్మతో అబద్ధం చెప్పింది. ఒంటరిగానే బీచికి పోయింది. జనసమూహము లేనిచోట మోహన్‌బాబుని కలుసుకుంది.

"సరోజా! మూడు ఎర్రగులాబీల మధ్య ఓతెల్ల గులాబీని ఎంత చక్కగా అమర్చి జడలోపెట్టు కున్నావు.........దీనికి ప్రత్యేకమైన అర్థం ఏమైనా వుందంటావా?"

"వుంది మోహన్ బాబు! ఎర్రగులాబీల ప్రతినిధి మీరేగా! మీహృదయ సీమలో పొందికగా భక్తితో ప్రేమతో అత్యంత అణుకువతో తెల్ల తెల్లగులాబీ పదిలమైన చోటు చూసుకుంది మోహన్ బాబూ!..... కాదంటారా?" ఆమాటను అంతముద్దుగా అడగటములో సరోజ ఎంతోనేర్పు చూపింది.

అలాంటి అవకాశము మరి లభిస్తుందో లేదో అన్న ఆత్రుతతో ఎన్నెన్నో విషయాలు మాటలాడు కున్నారు. అప్పుడప్పుడు చంద్రుడు వాళ్లబాధచూడలేక నల్లటి మబ్బుల వెనుక చాలసేపు దాక్కునే వాడు. అలాంటి సమయాన్ని సద్వినియోగం చేసుకుని మెల్లగా లేచారు.

"మోహన్ బాబూ! మెల్లగా ఇంటికి పోదాము. నే వెళ్లిన అరగంటగ్గాని మీరు ఇంటికి రాకండి. ఇద్దరమూ కలిసి వెళ్ళినట్టు తెలిస్తే మనవాళ్ళు అనుమానించడానికి అవకాశముంటుంది కనుక.... మరీ మరీ హెచ్చరించి చెపుతున్నా మోహన్‌బాబూ! చదువుమాత్రం ఏమాత్రం అశ్రద్ధ చేయకండి ఈ ఏడుకూడా మంచి మార్కులతో పాసవాలి."

బరువు బాధ్యతలు మోస్తున్న వాళ్ళు చెప్పినట్లు చెప్పింది. ఉజ్జ్వలమైన భవిష్యత్తుకోసము వెలుగు బాట వైపుకు చేయి పట్టుకుని లాక్కుపోయే స్నేహితురాలిలా చెప్పింది.

"నామీద విశ్వాసముంచు సరోజా!,,

ఇద్దరూ చంద్రుడికి కృతజ్ఞత చెపుతూవిడిపోయారు.

రంగనాయకులు నాయుడు కుర్చీలో కూర్చుని ఎప్పటిలానే తమ్ముడి భవిష్యత్తు పిల్లల అభివృద్ధి గురించి దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. సరోజ తల్లి కాంతమ్మ మోహన్ బాబూ వదిన సీతమ్మ వాకిట్లో కబుర్లు చెప్పుకుంటున్నారు. సరోజ గేటు తెంచుకుంటూ వచ్చి తనగదిలోకి వెళి ముందు నాయుడు గారికి పిత్రు సమానునిగా

# తెల్లగులాబి

దనుకున్నారు'' రమణి అమాయకంగాచెప్పుకు పోతోంది.

మోహన్ బాబు హృదయము బాధతోనిండి పోయింది. ''ఒక్కసారి చెపితేగాదూ! ఎంత కఠినంగా తయారయావు సరోజా!'' అని లోలోన దుఃఖాన్ని దిగమ్రింగుతున్నాడు.

''సరోజా! బహుశా సరోజ తిరిగి రాదను కుంటాను.'' అన్నారు నాయుడు గారు.

అందరూ ఆయనవైపు ఆత్రుతగా చూశారు.

''ఇవాళో రేపో ఉద్యోగంనుంచి తొలగిస్తున్నట్లు జారీచేసిన ఆర్డర్లు వాళ్లవూరికి చేరవచ్చు. అందుకని మరి తిరిగివచ్చే అవకాశంలేదు.''

సీతమ్మ ఏమీ అనలేదు. ఆగదివైపు జాలిగా మాత్రం చూసింది.

''మళ్లీరాదా అన్నయ్యా?'' అన్నాడు మోహన్ బాబు. అంతసేపూ ఆపుకున్న కన్నీళ్లు బలబల రాలాయి.

''చూడు మోహన్! దానివలలోపడి మంచి సంబంధాన్ని కాదనేస్తున్నావు. ఎప్పుడో ఆవిడమీద వచ్చిన ఫిర్యాదును పైకితీశాను...నేరం రుజువైంది.''

''నేరమా?''

''ఆ. సరోజ స్కూలు సర్టిఫికెట్‌లో కొంచెం కాపనివుంది......తాను నిజంగా ఆశాఖకు చెందింది కాదని ఎవరో వాళ్లవూరివాళ్లు ఫిర్యాదు చేశారు.''

''ఎంతపని చేశావన్నయ్యా! సరోజ నన్ను వలలో వేసికొందా! లేదన్నయ్యా లేదు, ఆరోజులు గుర్తున్నాయా! నాకు మెడిసన్‌లో సీటు వచ్చినప్పుడు ఇంట్లో డబ్బులేక వచ్చిన అవకాశాన్ని కాళ్లతన్నుకుని ఏ గుమస్తాగానో ఎక్కడైనా చేరాలనుకున్నాను—నాకు ధైర్యంచెప్పి యీ రెండేళ్లనుంచీ సరోజ నాకు ధన సహాయంచేసి చదివిస్తోందన్నయ్యా! తానూ, నేనూ నీలాంటి జీవితభాగిస్వాములమై నీ కుటుంబాన్ని నాలుగుచేతులతో సాకి పిల్లలకు ఉజ్జ్వలమైన వెలుగుబాటచూపాలని ఎన్నోసార్లు ప్రమాణం చేసుకున్నామన్నయ్యా! నీవు తనమీద కత్తికట్టేనట్లుగాని ఏపాటి సహాయం కావాలనికాని ఒక్కనాడైనా నోరువిడిచి అడగలేదుకాని జాబుల్లో వ్రాయటంకాని చేయలేదన్నయ్యా!''

నాయుడుగారు నిశ్చేష్టుడైపోయారు

భార్య సీతమ్మ సహాయంతో మెల్లిగా మంచం మీద కూర్చోగలిగారు.

ఆ పరిస్థితుల్లో అన్నయ్య ప్రాణంపోయినవాడిలా అయిపోతున్నాడు—వదిన సీతమ్మ గడగడలాడిపోతోంది.

పిల్లలందరూ ''నాన్నా!' అంటూ చుట్టుమూగారు. వదిన పవిత్రమైన నుదుటి తిలకాన్ని చూశాడు మోహన్‌బాబు. పిల్లల అమాయక ముఖాల్ని చూశాడు.

సిగ్గుల పెళ్లికూతురిలా ఎర్రగులాబీమొక్కల ప్రక్క నిల్చున్న తెల్లగులాబీ మొక్కల్నిచూస్తూ ''జోగారావుగారి సంబంధాన్ని చేసుకుంటాన్నన్నయ్యా'' అన్నాడు.

శుభమో అశుభమో ఎక్కడో తీతువ ఎగిరి శబ్దం చేసివెళ్ళింది. ●


# ఉచితము!

## అమూల్ బేబీ పుస్తకము



అమూల్ బేబీ పుస్తకము ఇప్పుడు ఉచితంగా తల్లులకు ఇవ్వబడుతుంది. గర్భధారణ, ప్రసవానికి ముందరి జాగ్రత్త. ప్రసవము, తల్లి పాలు, ఇతర ఆహారములు. మిశ్రమ ఆహారమును అలవాటు చేయుట. పిల్లవాని దినచర్య. పిల్లవాని అభివృద్ధి. జబ్బులను అరికట్టుట. ప్రథమ చికిత్స పసితనమందలి సాధారణ రోగములు మరియు జబ్బుతో నున్న పిల్లవాని యొక్క సంరక్షణను గురించి వాస్తవికమైన అధ్యాయములు గల ఈ 48 పేజీల పుస్తకము సులభశైలిలో అగ్రగణ్యుడైన ఒక స్పెషలిస్టుచే వ్రాయబడినది.

ఈ క్రింది కూపన్‌ను నింపి
పోస్ట్ బ్యాగ్ 10124,
బొంబాయి-1కు,
ఖర్చుల నిమిత్తమై
60 పైసల స్టాంపులతో పంపండి.

పోస్టు బ్యాగ 10124కు, బొంబాయి-1
తెలుగులో వ్రాయబడిన అమూల్ బేబీ పుస్తకము యొక్క ప్రతిని ఉచితంగా నాకు పంపండి

స్పష్టమైన పెద్ద అక్షరములలో పేరు మరియు ఎడ్రెస్

TL 108